## 22. కథానిక

ఆధునిక సాహిత్య ప్రక్రియల్లో కథానిక ప్రముఖ స్థానాన్ని అలంకరించింది . కథానికని చిన్న కథ అని వ్యవహరిస్తున్నారు. దీనిని ఆంగ్లంలో short story అంటారు. పాశ్చాత్య ప్రభావంతో భారతదేశంలోకి ప్రవేశించిన ఆధునిక సాహిత్య ప్రక్రియల్లో కథానిక ఒకటి.

ఆధునిక కాలంలో 1950 నుండి కథాసాహిత్యం ప్రారంభమైంది. పరవస్తు చిన్నయ సూరి,కందుకూరి వీరేశలింగం పంతులుగారు, రఘుపతి వెంకటరత్నం నాయుడు మొదలైనవారు సంస్కృత సాహిత్యం నుండి అనేక కథలను అనుకరించారు.

పూర్తిగా కథానిక లక్షణాలు కలిగిన రచన 1910 నుండి ప్రారంభమైందని చెప్పవచ్చు. తెలుగు సాహిత్యంలో కథానికకు శ్రీకారం చుట్టిన వారు గురజాడ అప్పారావు గారు. వీరు రచించిన తొలి కథ దిద్దుబాటు .ఈ కథను గురజాడ మొదట గ్రాంధిక భాషలో రచించి,తర్వాత వ్యావహారికంలోకి మార్చారు. తెలుగు

కథానిక విషయంలో భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ అప్పారావు గారే ఆధద్యులని చెప్పవచ్చు.

**కథానిక- నిర్వచనాలు:** కథానికను ఒక ప్రత్యేక సాహిత్య ప్రక్రియగా గుర్తించి ప్రపంచంలో మొట్టమొదటి సారిగా లక్షణ నిర్దేశం చేసిన ఘనత అగ్నిపురాణానికి దక్కుతుంది. “ఆదిలో భయానకం మధ్యలో కరుణ ,అంతంలో అద్భుతం అనే మూడు రసాలు ఉండి క్లుప్తంగా  అనుదాత్తంగా చేసిన రచన కథానిక” అని అగ్ని పురాణం లో నిర్వచించబడింది.

“ఆద్యంతాలు లేనిదే అసలైన కథానిక” అని చెకోవ్ నిర్వచించారు. “ కథంటే కథన రూపంలో చెప్పబడే చిన్ననాటిక”  అని హెన్రీ థామస్ నిర్వచించారు .

“కథానిక అంటే మళ్ళీ మళ్ళీ చదివించే ఖండకావ్యం, వెనుక నుండి సముద్రం  హోరు వినిపిస్తూ చూడటానికి మాత్రం కెరటంలా కనిపించేది” అని బుచ్చిబాబు నిర్వచించారు.

“ఉపక్రమణలో ఒక ఉత్కంఠ

నిర్వహణలో ఒక ఔత్సుక్యం

ఉపసంహారం లో ఒక విచిత్ర చంక్రమణం

కథకి కావలసిన అలంకారాలు"  అని బొడ్డు బాపిరాజు నిర్వచించారు.

**కథానిక లక్షణాలు:** ప్రముఖుల నిర్వచనాలను బట్టి కథానిక లక్షణాలను క్రింది విధంగా చెప్పవచ్చు.

1. సంక్షిప్తత: వస్తువులోను,సంఘటనల్లోను, పాత్రల్లోనూ విస్తృతి లేకుండా సాధ్యమైనంత తక్కువలో కథలు రాయాలి.
2. ఏకాంశ వ్యగ్రత: దీన్నే వస్త్వైక్యం అంటారు. మొత్తం కథ అంతా ఒకే ప్రధానాంశం ఉండాలి.
3. నిర్భరత: కథానిక చదివేటప్పుడు రెప్పపాటు గాని, రాసేటప్పుడు మనసుకు ఏమరుపాటు గానీ రానీయ కుండా ఉండే లక్షణం నిర్భరత అవుతుంది.
4. స్వయం సమగ్రత: కథలోని వస్తువు దానికదే సమగ్రంగా ఉండాలి.

5. <u>ప్రతిపాద్య ప్రవణత:</u> ప్రతిపాదించదలుచుకున్న అంశాన్ని దృష్టిలో పెట్టుకుని దాని వికాసానికి అనుగుణంగా రచన సాగించాలి.
6. <u>సంవాద చాతుర్యం:</u> సంభాషణ రూపంలో సాగే వాక్యాలు ఒక ప్రధాన అంశాన్ని ఆవిష్కరించేటట్లు ఉండాలి. ప్రతి సంభాషణ ప్రయోజనం కలిగించే విధంగా ఉండాలి.